Page No. 1 - Green Page No. 1 - Red Page No. 1 Black

ఆర్డిటి

# ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం అక్టోబరు 2004

FOR PRIVATE CIRCULATION ONLY

## మీరు గమనించారా !

### మీకు తెలుసా !

అమెరికాకు చెందిన టొబాకో కంట్రోల్ అనే పత్రిక తెలియజేసిన సమాచారం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా పొగతాగే వారి సంఖ్య బాగా తగ్గిపోతుండడంతో ప్రముఖ సిగరెట్ కంపెనీలు కొత్త మార్కెట్ ఎత్తుగడలతో ప్రచారానికి శ్రీకారం చుడుతున్నాయట. ఈసారి అంతంత మాత్రమే చదువు కలిగి పెద్దగా చైతన్యంలేని గ్రామీణ మహిళలకు పొగతాగడం అలవాటు చేయాలనుకుంటున్నాయట.

❖ ❖ ❖ ❖

హైదరాబాదులోని సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, రైస్ రీసెర్చ్ డైరెక్టరేట్ అనే సంస్థలు కలిసి క్రిమి కారణంగా వరిలో తరచుగా వచ్చే ఎండుతెగులు (బి.ఎల్.బి.) నిరోధక గుణం కలిగిన సాంబా మసూరి, త్రిగుణ వంగడాల్ని అభివృద్ధి చేశాయి. అంతేకాదు, ప్రస్తుతం ఇస్తున్న ఉత్పాదనకంటే మరింత అధికంగా ఉత్పాదన కలిగినవిగా అభివృద్ధి చేశారట. ఇంతవరకూ ఈ వ్యాధికి సరైన పురుగుమందు లేకపోవడం వల్ల ఈ వ్యాధితో వరి దిగుబడి 15-20 శాతం తగ్గిపోతున్నదని తెలిపారు.

❖ ❖ ❖ ❖

మన జిల్లాలో విస్తారంగా దొరికే బొప్పాయి అన్ని పండ్లకంటే ఎంతో శ్రేష్ఠమైనది. ఇది అనేక పోషక పదార్థాలు కలిగి ఉండటమే కాకుండా వైద్యరీత్యా కూడా ఎంతో మంచిదని చెప్తున్నారు. నిత్యం బొప్పాయి పండు తింటూ ఉంటే, శరీరానికి ఆహారంగా లాభం చేకూర్చడమే కాక ఉదర సంబంధమైన సమస్యలు తొలగిపోతాయి. పసిపిల్లలకు కూడా ఆహారంగా ఎంతో మంచిది. పచ్చికాయలో వచ్చే పాలు ఒక చెంచాడు తీసుకుని, దానికి సమానంగా తేనె రెండు చెంచాలు వేడినీళ్ళతో కలిపి తీసుకుంటే కడుపులో నులిపురుగులు కూడా చచ్చిపోతాయి.

**(డౌన్ టు ఎర్త్, ఆగష్ట్ 31, 2004 నుండి)**

❖ ❖ ❖ ❖

ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న నీటిని తాగుతూ ఉంటే ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందని తెలుసుగదా. దీనివల్ల, పళ్ళూ, శరీరంలోని ఎముకలు బలహీన పడి వంకర్లు పోతాయని కూడా మనకు తెలుసు. దేశంలోనే మొట్టమొదటిగా ఫ్లోరైడ్ ఉన్నదని కనుక్కున్నది 1937లో మనరాష్ట్రంలోనే. 1999 కల్లా దేశంలోని 17 రాష్ట్రాలకు ఈ వ్యాధి విస్తరించింది. దేశంలో దాదాపు మిలియన్ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ఈ వ్యాధి బారిన పడినారని ఒక పరిశీలనలో వెల్లడయింది.

**(డౌన్ టు ఎర్త్, సెప్టెంబర్ 15, 2004 నుండి)**

### చిట్కా:

కొంచెం వేడి నీళ్ళలో నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే జలుబు తీవ్రత తగ్గుతుంది.

## పంటమార్పిడి : బహుళ పంట వ్యవసాయ విధానము (Multiple Cropping System) లేదా సమగ్ర వ్యవసాయ విధానం (Integrated Rainfed Farming System)

***గత మాసంలో ఇదే విషయమై చర్చించుకున్నాము. దాని కొనసాగింపుగా మరికొన్ని విషయాలు తెలుసుకుందాం.***

### రిజర్వుడు అడవులను జీవ వైవిధ్య వృక్షసంపదతో వృద్ధి చేయడం :

ఫారెస్ట్ కమీషన్ వారి సిఫార్సుల ప్రకారం ఒక జిల్లా విస్తీర్ణంలో కనీసం 33 శాతం భూభాగం అడవితో నిండి ఉన్నప్పుడే ఆ జిల్లాలో పర్యావరణం కూడా సమతౌల్యంతోపాటు వ్యవసాయం స్థిరంగా ఉత్పాదకంగా వుంటుంది. వ్యవసాయం, దీర్ఘకాల మనుగడకు పర్యావరణ సమతౌల్యం తప్పకుండా అవసరం. మన జిల్లాలో దాదాపు 2 లక్షల హెక్టార్ల (10 శాతం) విస్తీర్ణంలో అడవులు ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులు చెపుతున్నాయి. కానీ, నిజంగా అడవులు మాత్రం 2 శాతం కూడా లేవని నిపుణుల అంచనా. అంటే మన జిల్లాలో తగినంత వృక్ష సంపదలేని అటవీ భూమి దాదాపు ఒక లక్షా యాభైవేల హెక్టార్లు ఉండవచ్చు. తగినంత స్థాయిలో వృక్షసంపద, పచ్చదనం ఉన్నప్పుడే పడే వర్షపాతం భూమిలోనికి ఇంకి భూగర్భజలాలను పెంచుతుంది. దూది నీటిని పీల్చినట్లు, అడవులు వర్షాన్ని పీల్చుకుంటాయి. తలిపిరులు, వంకలు, నదులలో నీటి ప్రవాహకాలం పెరుగుతుంది. గడ్డి, పచ్చదనం ఎండాకాలంలో కూడా ఎక్కువకాలం వుంటుంది. చెట్లు, గడ్డి భూములలో భూసారం కొట్టుకొని పోకుండా భూమిని రక్షిస్తాయి. చెరువులు, కుంటలు పూడి పోకుండా వుంటాయి. జీవ వైవిధ్యం పెరిగి వ్యవసాయానికి మేలుచేసే మిత్రప్రాణులు, మిత్ర సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు వృద్ధిచెంది వ్యవసాయోత్పత్తికి తోడ్పడతాయి. పశువులకు మేతతోపాటు అనేక పండ్లు, కాయలు, కలప, ఔషధ మొక్కలు, సుగంధ మొక్కలు మొదలగు ఉత్పత్తులు అడవుల నుండి లభించే అవకాశం ఉంది. అడవులున్న ప్రాంతాలు సుభిక్షంగా వుంటాయి. అడవులు లేని ప్రదేశాలే ఎడారులు! ఈ విషయం మనకందరికీ తెలుసు.

### స్వయం సహాయక సంఘాలద్వారా అడవుల అభివృద్ధి :

అడవులు ఫలసాయంపై బీదవారికి హక్కులతోపాటు, సంరక్షణ, పెంపకం బాధ్యతలను కూడా బీదవారి స్వయం సహాయ సంఘాలకు అప్పగించి, ఉపాధి హామి పథకం ద్వారా దీర్ఘకాల ఆర్థిక, సాంకేతిక వనరుల్ని సమకూర్చితే అడవులు పూర్వవైభవం సంతరించుకోవచ్చు. అడవి ప్రాంతాలలో భూసారాన్ని సంరక్షించుటకు, వర్షపు నీటిని ఒడుపుటకు తగినవిధంగా కాంటూరు కందకాలను విస్తృతంగా త్రవ్వాలి. వాటిలో మొక్కలు నాటాలి. అనువైనచోట్ల విత్తనాలను పూడ్చాలి. విమానాల ద్వారా తగిన విత్తనాలను అడవి ప్రాంతాల్లో విస్తృతంగా వెదజల్లాలి. అడవి ప్రాంతాల్లో వున్న చిన్న కుంటలను పునరుద్ధరించాలి. అడవులను సంరక్షించడానికి సాంఘిక నియంత్రణతోపాటు, అధికారిక నియంత్రణ కూడా అవసరము. అటవీ ఉత్పత్తులను ఒడుపుకొనుటలో కూడా స్వయం సహాయక సంఘాల నియంత్రణ అవసరము. దీర్ఘకాలంలో అడవి సంపదను క్షీణించని విధంగా అటవీ ఉత్పత్తులను ఒడుపుకొనవలయును.

### మన జిల్లాలో ఎడారీకరణ ఆగిపోవాలంటే :

1) పై విధంగా అడవులను దీర్ఘకాల ప్రణాళికతో అభివృద్ధి చేయాలి.
2) ఉమ్మడి భూములను, బీడు భూములను అభివృద్ధిచేసి, శాశ్వత పచ్చదనాన్ని పెంచాలి.
3) వ్యవసాయ భూమిలో 3 లక్షల హెక్టార్లలో పండ్ల తోటలు పెంచాలి.
4) 40 శాతం వ్యవసాయ భూమిలో సాగునీటిని పెంచాలి.

పై నాలుగు అంశాలను సాధించినప్పుడే అనంతపురం జిల్లాలో ఫారెస్ట్ కమీషన్వారు సిఫార్సు చేసినట్లు దాదాపు 33 శాతం అటవీ ప్రాంతముండాలన్న పర్యావరణ ప్రయోజనం చేకూరి, శాశ్వతంగా పర్యావరణ సమతౌల్యం ఏర్పడుతుంది. మన జిల్లా ఎడారీకరణ కూడా ఆగిపోతుంది. →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" – ఉపనిషత్తులు

## కృత్రిమ వర్షాలు ఒక నిరంతర, దీర్ఘకాల కార్యక్రమంగా, వర్షాభావ ప్రాంతానికంతా వర్తింపజేయుట :

కృత్రిమ వర్షాలు నిజంగా కురిపించడము సాధ్యమౌనో లేదో యిప్పటికింకా మనకు నిర్ధారణ కాలేదు. అయినా సాధ్యాసాధ్యాలను పరిశోధించవలసిన అవసరం మాత్రము ఉంది. అనంతపురం లాంటి కరువు జిల్లాకు ఏ ఒక్క వర్షం అదనంగా కురిపించగల్గినా రైతుకు గొప్పమేలు కల్గుతుంది. కాబట్టి కృత్రిమ వర్షాలను దీర్ఘకాల మేఘమథన పరిశోధన ప్రాజెక్టుగా (Longterm Research Project on Cloud Seeding) చేపట్టవలసివుంది. కానీ యిటువంటి ప్రాజెక్టు ఒక్క అనంతపురం జిల్లాకో, రాయలసీమకో పరిమితం చేయకుండా, ఆంధ్రా-కర్ణాటక రాష్ట్రాలలోని వర్షాభావ ప్రాంతాలను మొత్తం కలిపి ఒక అంతర్ రాష్ట్ర ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టాలి. కృత్రిమ వర్షప్రయోగాలకు ఒక జిల్లా విస్తీర్ణం చాలా చిన్నది అవుతుంది. ఈ వర్షాభావ ప్రాంతంలోకి రెండు రాష్ట్రాలలోని కోలారు, చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, మహబూబ్‌నగర్, తుంకూరు, చిత్రదుర్గ, బళ్ళారి, రాయచూరు, గుల్బర్గా, బీదర్ లాంటి కరువు జిల్లాలు కలుస్తాయి. విస్తీర్ణం పెరిగితేనే మంచి ఫలితాలు వుండవచ్చు. ఉదా:- నైరుతి ఋతుపవన కాలంలో తుంకూరు జిల్లాలో మేఘమథనం జరిగితే అనంతపురం జిల్లాలో వర్షాలు పడే అవకాశముంది. అంతేకాదు; వర్షాభావ ప్రాంతంలోని కర్నాటక జిల్లాలలో వర్షాలు కురిసినా తుంగభద్ర, కృష్ణా, హగరి, పెన్నా, చిత్రవతి, పాపాఘ్ని నదుల ద్వారా రెండు రాష్ట్రాలకు ఉపయోగం ఉంటుంది. ఈ వర్షాభావ ప్రాంతానికి అనంతపురం కేంద్రబిందువుగా వుంది. కాబట్టి ఆ పరిశోధనా కేంద్రాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయడం సమంజసము. అవసరమైనన్ని ఉప కేంద్రాలను కూడా ఏర్పాటు చేయవలసి ఉంటుంది. వాటి ద్వారా వర్షాభావ ప్రాంతాన్నంతా ప్రభావితం చేయగలినంత మౌలిక సదుపాయాలు, ఈ కేంద్రాలలో ఉండాలి. ఉదా:- పూర్తి విస్తీర్ణానికి సరిపడే రాడారు సదుపాయాలు, అవసరమయినన్ని విమానాలు, సాంకేతిక నిపుణులు మొదలగునవి ప్రతి జిల్లా స్థాయిలోనూ అందుబాటులో ఉండాలి.

## వ్యవసాయ, వ్యవసాయేతర పరిశ్రమల ద్వారా చదువుకొన్న నిరుద్యోగులకు ఉపాధి :

మన జిల్లాలో చదువుకొన్నవారి నిరుద్యోగం (Educated unemployment) పోవాలంటే, గృహ పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్ని ప్రోత్సహించాలి. వ్యవసాయాధారిత పరిశ్రమల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కూడా లభిస్తాయి. వ్యవసాయేతర పరిశ్రమల ద్వారా ఇతర ఉత్పత్తులు పెరిగి, వ్యవసాయేతర వ్యాపార, వాణిజ్య, ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. మన జిల్లాలో స్థాపించే పరిశ్రమలు, మానవ వనరుల (Labour Intensive) ఆధారంగా ఉపాధి అవకాశాలు పెంచేవిగా ఉండాలిగానీ, నిరుద్యోగులను పెంచే అధిక యాంత్రీకరణ (High Mechanization) విధానం సరిపోదు. కాబట్టి, పరిశ్రమలను ఎన్నుకొనడంలోనూ, సాంకేతిక-యాంత్రీకరణ విషయంలోనూ అతి జాగ్రత్తగా వ్యవహరించడం చాలా అవసరం. వ్యవసాయ, వ్యవసాయేతర పరిశ్రమల విషయంలో మన జిల్లాకు అనువైన పరిశ్రమలను సూచించుటకు తగిన పరిశోధన జరగాలి. మన జిల్లాలోవున్న మానవ వనరులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతరముడి పదార్థములు, మార్కెటింగ్ అవకాశాలు దృష్టిలో వుంచుకొని ఈ పరిశోధన (Research & Development) జరగాలి. పెద్దపరిశ్రమలకు అనుబంధంగా తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల ఈ పరిశోధనకోసం ఒక నిపుణుల కమిటీని నియమించడం సమంజసము.

## వ్యవసాయ పరిశ్రమలు :

మన జిల్లాలోని వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా వ్యవసాయ పరిశ్రమను గుర్తించి మన వ్యవసాయ ఉత్పత్తులకు విలువాధిక్యతను (Value Addition) చేకూర్చవలసి వుంటుంది. వేరుశనగ నూనెతోబాటు తిండి పదార్థాల ఉత్పత్తి, ప్రొద్దుతిరుగుడు విత్తనాలతో నూనె ఉత్పత్తి, నల్లరేగడి నేలలో పండించే వివిధ పంటలకు విలువాధిక్యత కలిగించే విధంగా పరిశ్రమలు ప్రోత్సహించి స్థాపించాలి. వేరుశనగను పప్పు, నూనెగానూ, పండ్లను పండ్ల రసముగానూ, ఇతర పండ్ల ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించవలయును. ఉదా: చీని పండ్లరసం, దానిమ్మరసం, జామరసం, సపోటరసం, మామిడిరసం మొదలగునవి. ధనియాలను పొడిగానూ, జొన్నలను పిండిగానూ, కందులను బేడలగానూ నాణ్యతను బట్టి రకాలుగానూ వాటి విలువను పెంచవలయును. బొప్పాయి, టొమాటో పండ్ల ప్రోసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలి. పాడి ఉత్పత్తులను, మాంస ఉత్పత్తులను, చర్మ పరిశ్రమను ప్రోత్సహించవలయును. తగిన శాస్త్ర పరిజ్ఞానంతో, ప్రపంచ ప్రమాణాలకు ధీటుగా నాణ్యత, ప్యాకింగ్, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థలను నెలకొల్పవలెను. తద్వారా రైతుకు గిట్టుబాటు ధర రావడంతోబాటు, నిరుద్యోగ సమస్య కూడా తగ్గుతుంది. పారిశ్రామిక ఔత్సాహికులకు, చదువుకొన్న యువతీయువకులకు పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు కలుగజేస్తూ, తగినవిధంగా పరిశ్రమల రాయితీలు యిచ్చి ప్రోత్సహించవలయును. ఇచ్చే రాయితీలు, ఎక్కువగా ఉపాధి కల్పన ఆధారంగా ఉంటే మంచిది.

## వ్యవసాయేతర పరిశ్రమలు :

మన జిల్లాలో వున్న ముఖ్యమైన, అతి విలువైన వనరు మానవ వనరులు. కాబట్టి ముఖ్యంగా తక్కువ యంత్రాలతో ఎక్కువగా మనుషులచేత ఉత్పత్తి చేయగల వ్యవసాయేతర ఉత్పత్తులను, సేవలను గుర్తించవలయును. ఉదా: అగరుబత్తి, కుట్టు పనులు, చేనేత మొదలగునవి. మన జిల్లాలో అన్ని స్థాయి నైపుణ్యములుకల మానవ వనరులు ఉన్నాయి. పై స్థాయి కంప్యూటర్ ఇంజనీర్ల నుండి, సాధారణ నిరక్షరాస్యుల వరకూ ఉన్నారు. అయితే గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కూడా అర-కొర అక్షరాస్యులు, తక్కువ నైపుణ్యంగల ఉత్పత్తులు మాత్రమే చేయగలవారు అత్యధికంగా వున్నారు. కాబట్టి వారి నైపుణ్యస్థాయికనువైన ఉత్పత్తులను గుర్తించి ప్రోత్సహించవలయును. దాని ద్వారా వాటి ప్యాకేజింగ్, మార్కెటింగ్, రవాణా ఎగుమతులు, ముడి పదార్థాల దిగుమతులు మొదలగు సేవలలో చదివిన నిరుద్యోగులు (Educated unemployed) ఉపాధి పొందవచ్చును. పెద్ద పరిశ్రమలకు అనుబంధంగా వికేంద్రీకరించగల వస్తు ఉత్పత్తి అవకాశాలను శోధించవలయును.

ఇంకనూ మనజిల్లాలో లభ్యమవుతున్న ముడిపదార్థాల ఆధారంగా పరిశ్రమలు ప్రోత్సహించవలయును. ఉదా:- నల్లరాయి (Black Stone) బండరాయి (Granite) మొదలగు ముడి పదార్థాలతో భిన్న ఉపయోగములుగల ఉత్పత్తులను రూపొందించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయవచ్చును. ఇటువంటి ఉత్పత్తులపైన తగిన వస్తుపరిశోధన (Product Research) చేయడం కూడా అవసరము.

అనంతపురం జిల్లాలో ప్రచ్ఛన్న నిరుద్యోగం కూడా ఎక్కువ. అంటే చాలామంది దినంలో కొన్ని గంటలు మాత్రమే పనివుండి, మిగిలిన గంటలు పనిలేకుండా ఉంటారు. ఇటువంటి వారికోసం తీరిక గంటలలో మాత్రమే చేయగల ఉపాధి అవకాశములను పరిశోధించవలయును. తద్వారా భిన్న జీవనోపాధుల ద్వారా ఆదాయం పెరగడంతోపాటు, ఆదాయ భద్రత కూడా ఏర్పడుతుంది.

**వై. వి. మల్లారెడ్డి**
డైరెక్టరు - ఎకాలజి

# గత మాసంలో జరిగిన రైతు సదస్సు

## ఆర్.డి.టి./ యాక్షన్ ఫ్రటర్నా ఆధ్వర్యంలో "అనంతపురం జిల్లాలో భూగర్భజల సంక్షోభం" పై రైతు సదస్సు

**వేదిక : లలిత కళాపరిషత్, అనంతపురం.**

**తేది : 19-8-2004 ఉ॥ 10గం॥ నుండి సా॥ 5 గం॥ వరకు**

**పాల్గొన్నవారు :** వివిధ గ్రామాలనుంచి వచ్చిన దాదాపు 1500 మంది మహిళా రైతులు, పురుష రైతులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మరియు పలు శాఖలకు చెందిన ప్రభుత్వోద్యోగులు.

సభాధ్యక్షులు : **శ్రీ వై.వి. మల్లారెడ్డి,** డైరెక్టర్-ఎకాలజి, RDT/AF

ముఖ్య సందేశకులు :

**గౌ॥ శ్రీమతి వై.వి. అనూరాధ,** I.A.S., జిల్లా కలెక్టర్‌గారు

ప్రత్యేక సందేశకులు :

**శ్రీ పి. రాఘవయ్య,** ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ

**శ్రీ డా॥ హరి జవహర్‌లాల్,** ప్రాజెక్ట్ డైరెక్టర్, వెలుగు మరియు డిఆర్‌డిఏ

**శ్రీ గణేశ్వరరావు,** యస్.ఇ. గ్రామీణ నీటి సరఫరా

**శ్రీ నాగభూషణం,** డిప్యూటి డైరెక్టర్, భూగర్భజల శాఖ మరియు

ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

❖ ❖ ❖ ❖

సదస్సు ప్రారంభంలో - శ్రీ యు. తిరుమలరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, ఆర్‌డిటి/ఏఎఫ్, ప్రత్యేక సందేశకులైనటువంటి పైన తెల్పిన ప్రభుత్వాధికారులను వేదికనలంకరించవలసిందిగా కోరినారు. సభను శ్రీ మల్లారెడ్డి, డైరెక్టర్-ఎకాలజీ, నిర్వహించారు.

**శ్రీ మల్లారెడ్డిగారు** తమ తొలిపలుకులో - తనకు తెలిసినంతవరకూ, భూగర్భ జలాల సంక్షోభంపై ఇంత పెద్ద సంఖ్యలో రాష్ట్రంలో జరుగుతున్న మొట్టమొదటి రైతు సదస్సుగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. భూగర్భ జలాల సంక్షోభం చాలా క్లిష్టమైన సమస్యఅని, తీవ్ర వర్షాభావ పరిస్థితులలో సైతం అనంతపురం జిల్లాలోని కొంతమంది రైతులు నేటికీ ఏదోవిధంగా కొంతైనా పంటలు సాగునీటితో పండించుకుంటున్నారంటే దానికి భూగర్భజలాలే కారణమన్నారు. అదేసమయంలో, మన జిల్లాలో దాదాపు 400 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే నూటికి డెబ్భై శాతం బోరుబావులలో భూగర్భజలాల వైఫల్యమే కారణమని అన్నారు. విచిత్రంగా రైతును అటు బ్రతికించడానికైనా, ఇటు చంపడానికైనా భూగర్భజలాలే కారణం కావడాన్నిబట్టి ఇవి ఎంత సంక్లిష్టమైన, సున్నితమైన సమస్యో అర్థమవుతుందన్నారు. ఇంతే వేగంగా భూగర్భజలాలు విచక్షణారహితంగా తోడేస్తే, సమీప భవిష్యత్తులో అవి పూర్తిగా ఎండిపోయి, జిల్లాలో ప్రాణికోటి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా ఎంత నీటిని ఆదా చేసి, నిల్వ చేసినా, దానికి రెట్టింపు మొత్తంలో తోడేస్తున్నారన్నారు. జిల్లాలో సుమారు 27 లక్షల ఎకరాల భూమి సాగులో వుండగా, చెరువులు, కుంటలక్రింద కేవలం 3 లక్షల ఎకరాలే సాగవుతుందని చెప్పారు. హంద్రీనీవా వచ్చినా, గోదావరి, కృష్ణా జలాలను మళ్ళించినా, అవి మహా అయితే మరో 6, 7 లక్షల ఎకరాలకు సరిపోతాయని, మిగిలిన 20 లక్షల ఎకరాలకు పై భూగర్భజలాలే శరణ్యమన్నారు. కాబట్టి భూగర్భజలాలను మనము ఏమాత్రం అశ్రద్ధ చేసినా, అనంతపురం జిల్లాలో రైతులకు భవిష్యత్తులేదని తీవ్రంగా హెచ్చరించారు. ఈ అంశాలను గ్రామాలలో రైతులు తీవ్రంగా పరిగణించి చర్చించాలని చెప్పారు. కాబట్టి, భూగర్భజలాల వినియోగంలో అదుపు తీసుకొనిరావడం తప్ప, వేరే మార్గమే లేదన్నారు. భూగర్భజల వినియోగాన్ని క్రమబద్ధీకరించడానికి రైతులు నడుం బిగించాలని రైతులకు పిలుపునిచ్చారు.

**శ్రీ పి. రాఘవయ్య, ప్రాజెక్ట్ డైరెక్టర్, డి.డబ్ల్యూ.ఎం.ఏ.,** మాట్లాడుతూ, ప్రస్తుత సంక్షోభానికి, తక్కువ, నమ్మకంలేని వర్షపాతం, జనాభా పెరుగుదల మరియు అటవీప్రాంతం తగ్గిపోవడంలాంటివి కారణమన్నారు. దీని దుష్ప్రభావాల వల్ల జిల్లాలో దాదాపు 16 మండలాల్లో తీవ్రత నీటి ఎద్దడి వుందని, పశుపోషణ భారమై తక్కువ ధరకే అమ్ముకుంటున్నారనీ, రైతులు వలసలు పోతున్నారనీ చెప్పారు. చెట్లు నరికివేత, పొలాల గట్లు దున్నివేయడం, చెక్‌డ్యాములు పూడికతీయక పోవటం, విచక్షణారహితంగా భూగర్భజలాల తోడివేత, సహజవనరులు సంరక్షించకపోవటం, నీరు వృధాచేయడం వంటి మానవ కల్పిత చర్యలు కూడా కారణమన్నారు.

**డా॥ హరిజవహర్‌లాల్, ప్రాజెక్ట్ డైరెక్టర్, వెలుగు మరియు డిఆర్‌డిఏ,** మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలో ఊరిపేర్లకు చివర సముద్రం అని ఉంటుందని, కానీ అక్కడ చుక్కనీరు కూడా లభ్యంకాదని చెప్పారు. అప్పులు చేసి బోర్లువేస్తే నీరుపడకపోగా, అప్పుల ఊబిలో కూరుకోవటంతో రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారన్నారు. చెట్లు నాటడం కన్నా, ఎక్కువ నరికేస్తున్నారని, దీని కారణంగా గాలి వేగం పెరిగి, భూసారం క్షీణించిపోతోందన్నారు. భూమికి సంబంధించినంతవరకూ రైతే శాస్త్రజ్ఞుడనీ, రైతుకు ఎక్కువ విషయాలు తెలుస్తాయన్నారు. పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం లేకపోతే అభివృద్ధి శూన్యమన్నారు.

**శ్రీ నాగభూషణం, యస్.ఇ. డిప్యూటీ డైరెక్టర్, భూగర్భజల శాఖ,** మాట్లాడుతూ - అనంతపురం జిల్లాలో ఒకప్పుడు భూగర్భ నీటి మట్టం సరాసరి 40 అడుగులు లోతులో వుండగా, ప్రస్తుతానికి 60 అడుగులకు పడిపోయిందని, పరిస్థితులు ఇలాగే ఉంటే 2020 సంవత్సరానికి 120 అడుగుల లోతుకు సగటు నీటిమట్టం పడిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. ఒక్క ఇసుక రేణువు తయారవడానికి దాదాపు 100 సం॥లు పడుతుందనీ, నేలలో తేమను భద్రపరచడానికి ఇసుక ఎంతో ఉపయుక్తమని చెబుతూ- పెన్నా, చిత్రావతి మొదలగు నదులలో ఇసుక త్రవ్వకాలు కూడా విచక్షణారహితంగా చేస్తున్నారన్నారు. భూగర్భజలాలు తగ్గిపోవడంవల్ల, నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా పెరుగుతోందనీ, జిల్లాలోని దాదాపు 70 శాతం మండలాల్లో ఫ్లోరైడ్ వుందనీ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల ఆవరణలలో ఇంకుడు గుంతలు త్రవ్వి, తులసి, బొప్పాయి, కనకాంబరం మొక్కలను నాటితే, అవి భూమిలోకి ఇంకే నీటిని శుభ్రపరుస్తాయని తెలిపారు. నీటి సంరక్షణ చర్యలు యుద్ధప్రాతిపదికన తీసుకోకపోతే భవిష్యత్తులో ప్రతినీటి బొట్టుకు, కన్నీటి బొట్టురాల్చవలసి వస్తుందని హెచ్చరించారు.

**శ్రీ గణేశ్వరరావు, గ్రామీణ నీటిసరఫరా,** వారు ప్రసంగిస్తూ, ప్రస్తుత తరుణంలో భూగర్భజల సంక్షోభంపై ఇటువంటి సదస్సు ఏర్పాటుచేసి రైతులకు అవగాహన కల్పించడం చాలా మంచి ప్రయత్నమనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తికీ రోజుకు 40 లీటర్లు మంచి నీరు అందించవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుందనీ, జిల్లాలో సుమారు 2,30,000 వ్యవసాయబోర్లు వుండగా, త్రాగునీటి మోటార్లతో కలిపి కేవలం 2,000 బోర్లు మాత్రమే వాడుతున్నారని తెలిపారు. బోరుబావుల చుట్టూ 2 మీ. వ్యాసార్థంతో, 2 మీ. లోతు త్రవ్వినట్లైతే, ఎత్తునుంచి పల్లానికి వర్షపు నీరు అందులోకి దిగి 20 శాతం నుంచి 30 శాతం వరకూ బోరు రీచార్జ్ అవుతుందనీ, కావున రైతు సోదరులు ఈ విధంగా చేసుకోవాలని కోరారు.

**డా॥ వెంకటరమణ, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్థక శాఖ** వారు మాట్లాడుతూ - తీవ్ర నీటి కొఱత కారణంగా రైతులు వ్యవసాయంపైనే గాకుండా ఇతర ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు అనగా పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం మొదలగు వాటిపై ఆధారపడి జీవించవలెనని అభిప్రాయపడ్డారు. జిల్లాలో దాదాపు 85,000 కుటుంబాలు వీటిని జీవనాధారంగా చేసుకొని బ్రతుకుతున్నాయని తెలిపారు. అంతేగాక, తక్కువ పశుసంపదతో ఎక్కువ ఉత్పత్తి సాధించవలెనన్నారు.

**శ్రీ గోవిందచౌదరి, ఆదర్శరైతు, ధర్మవరం :** అనంతపురం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్.డి.టి. సేవలను కొనియాడారు. రైతులు జిల్లాలోని భూములకు అనుకూలమైన పంటలు మాత్రమే పండించాలనీ, సాంకేతిక అంశాలను, మెళకువలను పాటించినట్లైతే అధిక దిగుబడులు పొందవచ్చని తెలియజేశారు. అంతేగాక, ఇటువంటి రైతు సదస్సులను గ్రామస్థాయిలోగానీ, మండల స్థాయిలోగానీ నిర్వహించి రైతులకు భూగర్భజలాల పరిరక్షణపై చక్కని అవగాహన కల్పించవలసినదిగా ఆర్‌డిటిని అభ్యర్థించారు. రైతులను తన పొలమును సందర్శించవలసినదిగా ఆహ్వానించారు.

**శ్రీ ఆనంద్, రైతు, బట్టువానిపల్లి గ్రామం :** ఆరేళ్ళక్రితం తమ గ్రామంలో నీటి కొరతవున్నదనీ, కానీ, వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా నీటి సంరక్షణ చేపట్టుటకు కట్టుబాట్లు ఏర్పాట్లు చేసుకోవడంతో ప్రస్తుతం తమకు నీటి కొరత లేదని తెలియజేశారు.

**శ్రీమతి లక్ష్మీదేవి, చిన్నహోతూరు గ్రామం :** తన చిన్నతనంలో 60 అడుగులకు నీరు పడేదనీ, ఇప్పుడు 200 అడుగులు త్రవ్వినా నీరు రావటంలేదనీ తెలియజేశారు.

**శ్రీమతి నాగలక్ష్మి, రైతు మహిళ, మానిరేవు గ్రామం :** తమ గ్రామంలో మొత్తం 200 బోరు బావులుండగా, కేవలం 20 నుంచి 30 బోర్లలో మాత్రమే ఒక అంగుళం నీరు వుస్తున్నాయని తెలిపింది. ఒక బోరుకు, మరొక బోరుకు మధ్య కనీసం 150 అడుగుల దూరం వుంచాలనీ రైతులను కోరడం జరిగింది.

**శ్రీ మల్లిఖార్జున, రైతు, బసంపల్లి గ్రామం :** వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా చేపట్టు నీటి సంరక్షణా చర్యలతో నీటిని సంరక్షించుకోవాలనీ, తక్కువ నీరు అవసరమగు పంటలు మాత్రమే వేయాలనీ, 'శ్రీ' పద్ధతిలో మాత్రమే వరిని పండించుకోవాలని కోరారు.

**శ్రీమతి ఈశ్వరమ్మ, చిన్నంపల్లి గ్రామం :** తమ గ్రామంలో గత నాలుగేళ్ళలో దాదాపు 70 బోరు

**(తరువాయి భాగం 4వ పేజీలో చూడండి.)**

(3వ పేజీ తరువాయి భాగం)

బావులు ఎండిపోయాయని, కేవలం 75 ఎకరాలు మాత్రమే బోరుబావుల క్రింద సాగులోవుందని వెల్లడించడం జరిగింది. తుంపర సేద్యం, బిందు సేద్యం ద్వారా పంటలు పండించాలని రైతులను కోరారు. ఇకమీదట బోర్లు త్రవ్వరాదని విజ్ఞప్తి చేయడం జరిగింది.

**శ్రీ ఎర్రిస్వామి, రైతు, ఐదుకల్లు గ్రామం :** ఈయన మాట్లాడుతూ-తమ గ్రామంలోని బావులలో నీరులేదని, బోరుబావులలో నీరుపడటంలేదని, 8 నుంచి 10 బోర్లు 300 అడుగులకుపైగా వేసినా నీరు రాలేదని తెలిపారు. చెట్లు నరికివేయడాన్ని అరికట్టాలనీ, నీటి సంరక్షణా చర్యలు చేపట్టాలని కోరారు.

**శ్రీ తిమ్మారెడ్డి, పొబ్బర్లపల్లి గ్రామం :** పూర్వకాలంలో నిర్మించిన చెరువులు, కుంటలలో పూడిక చేరి, కట్టలు తెగి, నిర్లక్ష్యానికి గురై ఎండిపోయాయని, వర్షాభావ పరిస్థితులలో రైతులు బోర్లు వేసుకొని భూగర్భజలాలపై ఆధారపడుతున్నారని అన్నారు. రానురానూ ఈ బోర్లు విపరీతంగా పెరిగిపోయి భూగర్భజలాల ఉనికే ప్రశ్నార్థకమౌతోందన్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో ఫ్లోరైడ్‌వంటి యితర దుష్పరిణామాలు ప్రజలు అనుభవిస్తున్నారని కూడా అన్నారు. పొబ్బర్లపల్లి గ్రామంలో ఈ సంవత్సరం ఇప్పటివరకూ వేసిన 60 బోర్లలో 10 బోర్లలో మాత్రమే నీరు వస్తున్నదనీ తెలిపారు.

**శ్రీ బాషా, మానవ హక్కుల వేదిక :** రైతుల ఆత్మహత్యలకు నూటికి డెబ్భైశాతం బోరుబావులకు చేసిన అప్పులే కారణమన్నారు. గతంలో పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో సాగునీటికి, త్రాగునీటికి కొదువలేదని భావించేవారమని, కానీ అక్కడ కూడా సాగుకు 60% ఉపరితల జలం, 40% భూగర్భజలాలపై ఆధారపడటంతో అక్కడకూడా భూగర్భ జలాల సంక్షోభం మొదలైందని అన్నారు. జిల్లా శ్రేయస్సు దృష్ట్యా కనీసం 10 సంవత్సరములు బోరు బావులు త్రవ్వకంపై ప్రభుత్వం మారటోరియం విధించాలని శ్రీ బాషా డిమాండ్ చేశారు. ఇందుకు రైతులు తనను దూషించినా అభ్యంతరం లేదన్నారు.

**జిల్లా కలెక్టర్‌గారి ప్రసంగం :**

**శ్రీమతి వై.వి.అనూరాధ, ఐ.ఏ.యస్., జిల్లా కలెక్టర్‌గారు మాట్లాడుతూ –** జిల్లాలో కరువుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనీ అంటూ మన జిల్లాకు (1) ప్రకృతి (2) విచ్చలవిడిగా త్రవ్వుతున్న బోర్లు ముఖ్య శత్రువులని అన్నారు. రెండు బోర్లు ఎండిపోతే, మూడో బోరు త్రవ్వినా ఖచ్చితంగా నీరు రాదని తెలిపారు. 63 మండలాల్లో దాదాపు 58 మండలాల్లో భూగర్భజలాలు అడుగంటి బోర్లు త్రవ్వలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. తిండి, గడ్డి వంటివి లేకపోతే ఎఫ్.సి.ఐ. నుంచి బియ్యం, ఇతర ప్రాంతాలనుంచి గడ్డి తెచ్చుకోవచ్చునీ, కానీ, నీరు తెచ్చుకోవడం సాధ్యంకాదనీ, ఖరీదైన రవాణా సంబంధమైన వ్యవహారమన్నారు. జిల్లాను రక్షించుకోవాలంటే ఇంతటితో బోర్ల త్రవ్వకానికి స్వస్తి చెప్పాలని చెప్పారు. ప్రతి చుక్క వర్షపునీటిని నిల్వచేసుకోవాలనీ, ప్రజలలో సామాజిక స్పృహ పెరగాలని తెలిపారు. గతంలో సజ్జ, జొన్న రొట్టెలను తినేవారని, ఇప్పుడవి మానేశారని తెలిపారు. రాయలసీమ ప్రజలు కష్టపడేతత్వం కలవారనీ, కాబట్టే జొన్నరొట్టెలను కూడా అరిగించుకోగలిగేవారనీ తెలిపారు. కొళాయిల వద్ద నీటిని వృధాచేయరాదనీ మహిళలకు సూచించారు. స్నానాలు చేసిన నీటిని, పాత్రలు శుభ్రం చేసిన నీటిని వృధాగా వదిలేయకుండా గ్రామంలోని మహిళలంతా కలిసి ఇంకుడుగుంతలు త్రవ్వకుని, అందులోకి ఆ నీటిని మళ్ళించవచ్చు అన్నారు. 2002 సంవత్సరములో చేసిన ఏపి వాల్టా చట్టంలో లోపాల్ని ఎత్తిచూపి, వాటిని సవరించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. 10 సంవత్సరములపాటు జిల్లాలో బోర్లు వేయకుండా నిషేధిస్తే, భూగర్భజలాలు పెరిగే అవకాశముందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 5 రాష్ట్రాలలోని 5 జిల్లాలలో చిన్న నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాన్ని వచ్చే 5 సంవత్సరములకు చేపట్టనున్నదనీ, మన రాష్ట్రంలో అనంతపురం జిల్లాను ఈ కార్యక్రమం క్రింద ఎన్నికచేశారనీ, దీన్ని ఒక వరంగా భావించాలన్నారు. అంతేగాక రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ పథకం జిల్లాలో అమలు చేయనున్నట్లు, ఈ పథకంలో ప్రతి మండలంలో కొన్ని ఎకరాలను ఒక బ్లాకుగా గుర్తించి సూక్ష్మనీటి సాగు, పశు సంరక్షణ, భూసార సంరక్షణ చర్యలు, వర్మీ కంపోస్టు తదితర కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు.

**సదస్సులో రైతులందరూ కలిసి చేసిన తీర్మానాలు :**

1. ఒక్కనీటి చుక్క కూడా త్రాగునీటిని గానీ, సాగు నీటినిగానీ, వృధా చేయము.
2. ఒక బోరు క్రింద ఎంత పంట పెట్టాలో గరిష్ఠ పరిమితిని ప్రభుత్వం నిర్ణయించి, ఒకే రైతు అధిక వినియోగాన్ని తగ్గించాలి.
3. ఒక రైతుకు ఎన్ని పనిచేసే బోర్లు వుండాలో ప్రభుత్వం గరిష్ఠ పరిమితి విధించి, ఒకే రైతు ఎక్కువ బోరు బావులు త్రవ్వకుండా అరికట్టాలి.
4. అనంతపురం జిల్లాకు వరి, చెరకు శత్రుపంటలు. కాబట్టి వాటిని నిషేధించాలి. ఒక వేళ వరి పెట్టాలంటే కేవలం 'శ్రీ' పద్ధతి పాటించాలి.
5. చెరకు పంట అనంతపురం జిల్లాలో నిషేధించాలి.
6. ఏపి వాల్టా చట్టం ప్రకారం ఒక బోరుకు మరొక బోరుకు మధ్య 250 మీ॥ దూరం ఉండాలి. కానీ, దీనిని పునఃపరిశీలించి, పరిశోధించి, 400 మీ॥ నుంచి 500 మీ॥ వరకు పెంచాలి. ప్రస్తుతమున్న బోర్లను రక్షించాలి.
7. ఇప్పటికే అధికంగా నీటిని తోడుతున్న గ్రామాలలో బోరుబావులు త్రవ్వట పూర్తిగా నిషేధించాలి.
8. ప్రభుత్వం యిచ్చే సబ్సిడీని ఉపయోగించుకొని సూక్ష్మనీటిసాగు అమలుచేసి, 'ప్రతి నీటి చుక్కకు ఎక్కువ పంట' (More Crop per Drop) అనే సిద్ధాంతంతో సమర్థవంతంగా పంటలు పండించాలి.
9. బోర్లు వేయవలసి వస్తే కమ్యూనిటీ బోర్లు (4,5 కుటుంబాలకు కలిపి ఒక బోరు) మాత్రమే వేయాలి.

**ఈ తీర్మానాలన్నీ జిల్లా కలెక్టరు వారికి సమర్పించడం జరిగింది.**

## ఈ మాసపు సూక్తి :

తే. ధరణి ధేనువుఁ బితుకంగఁ దలఁచితేని
జనులఁబోషింపు మధిప ! వత్సములమాడ్కి,
జనులు పోషింపబడుచుండ జగతికల్ప
లత తెరంగున సకల ఫలంబు లొసగు

– భర్తృహరి

**తాత్పర్యము :** ఆవులాంటి భూమినుండి ప్రభుత్వం ఆదాయాన్ని పితకాలనుకుంటే, లేక బాగా రాబట్టాలనుకుంటే, ఆవు దూడను సాకినట్లుగా ప్రజలను బాగా చూసుకోవాలి. వ్యవసాయం చేసేవారికి ప్రోత్సాహమివ్వాలి. వారి కష్టసుఖాలు తెలుసుకుని ఆదరించాలి. అలాచేస్తే రైతులు బాగా వ్యవసాయం చేస్తారు. నేలతల్లి కల్పవృక్షం మాదిరిగా కోరినవాటిన్నింటినీ ఇస్తుంది.

**చర్చ :** భూమిని ఒక పాడి ఆవుతో పోలుస్తున్నారు భర్తృహరి. పాడియావునుంచి బాగా పాలు రాబట్టాలంటే, ఆ ఆవుకు మంచి పచ్చిగడ్డి, తవుడు, ఇతర బలవర్ధక ఆహారాలు అవసరం. అందుకే వ్యవసాయక దేశమైన మన దేశంలో ప్రభుత్వాలకు ఆదాయాలు రావాలన్నా, ప్రజలు సుఖశాంతులతో బతకాలన్నా పంటలు బాగా పండాలి. వ్యవసాయదారుల కష్టసుఖాలను తెలుసుకొని వారికి ప్రోత్సాహమివ్వాలి. దురదృష్టవశాత్తు, మన ప్రభుత్వాలు వ్యవసాయానికి ఆశించినంతగా ప్రోత్సాహమివ్వలేదు. అనేకరకాల చీడపీడల్నుంచి, ప్రకృతి వైపరీత్యాల్నుంచి బయటపడిన పంటల ఉత్పత్తులు, మార్కెట్‌లో అమ్మబోతే అడివి అవుతున్నది. అదే రైతు తాను కొనుగోలు చేసే వాటికోసం పోతే మార్కెట్టు కొరివి అవుతున్నది. మొత్తం దేశ ఆర్థిక పరిస్థితిలో కీలకపాత్ర వహిస్తున్న వ్యవసాయానికి స్థిరమైన మార్కెట్టు ఉండదు. మార్కెట్‌లో దొరికే ప్రతి వస్తువుకు అంటే గుండుపిన్ను నుంచి గడ్డపార వరకూ ఉత్పత్తిదారుడు రేటును నిర్ణయిస్తాడు. తన ఉత్పత్తికి రేటు నిర్ణయించుకోలేని ఉత్పత్తిదారుడు ఒక్క రైతు మాత్రమే. నేలతల్లిని కల్పవృక్షంగా పోలుస్తున్నాడు భర్తృహరి. ప్రస్తుతం ఈ కల్పవృక్షం మనుగడ ప్రశ్నార్థకంలో పడింది. వ్యవసాయాన్ని మళ్ళీ బ్రతికించుకోవాలి. అందుకు కేవలం ప్రభుత్వాల మీదనే ఆధారపడి ప్రయోజనం లేదు. అందుకు మనం మార్గాలను వెదకాలి. మనల్నందరినీ బతికించే నేలతల్లిని మనం బతికించుకోవాలి. నేల బాగోగుల్ని పట్టించుకోవాలి. పడే వర్షాన్ని సద్వినియోగం చేసుకోవడమెలాగో ఆలోచించాలి. ప్రభుత్వాలు తమ బాధ్యతల్నే సక్రమంగా నిర్వర్తించలేనప్పుడు, మన బాధ్యతల్ని కూడా ప్రభుత్వాల మీద మోపితే మొదటికే మోసం వస్తుంది.

**వై.వి. మల్లారెడ్డి**

ప్రచురణ: డైరెక్టరు – ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం – 515 002.
☎ (08554) – 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) – 244990